సాక్షి
తిరుపతి
సోమవారం । 13 । మార్చి । 2023



తిరుపతి బులియన్
బంగారం :
24 క్యారెట్లు 10 గ్రాములు రూ.52,000
22 క్యారెట్లు ఒక గ్రాము రూ.5,000
వెండి:
హోల్‌సేల్ ధర (కిలో) రూ.64,000
రిటైల్ వెండి గ్రాము రూ.66

	గరిష్ఠం	కనిష్ఠం
తిరుపతి	36	20
చిత్తూరు	35	15
తిరుమల	32	16
గూడూరు	35	22
నగరి	37	21

అమ్మవారి సేవలో లయ



తిరుచానూరు(చంద్రగిరి) : తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని ఆదివారం ప్రముఖ సినీ నటి లయ దర్శించుకున్నారు. ముందుగా ఆలయ ధ్వజస్తంభం వద్ద మొక్కుకుని అమ్మవారి మూలవిరాట్‌ను దర్శించుకున్నారు.

న్యూస్‌రీల్

నిర్భయంగా ఓటు వేయండి



పోలింగ్ సామగ్రిని తరలిస్తున్న అధికారులు

తిరుపతి అర్బన్: ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధం చేశాం, నిర్భయంగా ఓటు వేయండి అని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి పిలుపునిచ్చారు. ఆయన ఆదివారం తిరుపతి శ్రీపద్మావతి మహిళా డిగ్రీ కళాశాలలో పోలింగ్ సామగ్రి పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు. కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ జిల్లాలోని తిరుపతి, శ్రీకాళహస్తి, గూడూరు, సూళ్లూరుపేట రెవెన్యూ డివిజన్ల కేంద్రాల నుంచి పోలింగ్ సామగ్రిని పంపిణీ చేశామని వెల్లడించారు. ప్రతి ఓటరు ప్రశాంతమైన వాతావరణంలో ఓట్లు వేయడానికి వీలుగా ఏర్పాట్లు చేపట్టామని చెప్పారు. పోలింగ్ అనంతరం బ్యాలెట్ సీలింగ్ ఏజెంట్ల సమక్షంలో పూర్తిచేసి సంబంధిత డివిజన్ కేంద్రంలోని స్ట్రాంగ్ రూమ్‌లో అప్పగించాలని వివరించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో 16 మంది ప్రత్యేక అధికారులను నియమించినట్లు తెలిపారు. కార్యక్రమంలో తిరుపతి రెవెన్యూ డివిజనల్ అధికారి కనకనరసారెడ్డి, నగరపాలక అసిస్టెంట్ కమిషనర్ పోలింగ్ సునీత, శిక్షణకు నియమించిన రిటైర్డ్ జేసీ చంద్రమౌళి, విధులు కేటాయించిన పీఓలు, ఏపీవోలు పోలింగ్ సిబ్బంది ఉన్నారు.

కట్టుదిట్టమైన భద్రత



రికార్డులను పరిశీలిస్తున్న డీఐజీ రవిప్రకాష్

రామకుప్పం: అనంతపురం రేంజ్ పరిధిలో జరుగుతున్న పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాటు చేసినట్లు అనంతపురం రేంజ్ డీఐజీ ఎం.రవిప్రకాష్ తెలిపారు. ఆదివారం ఆయన రామకుప్పం పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో డీఐజీ మాట్లాడుతూ చిత్తూరు, తిరుపతి జిల్లాలోని పోలింగ్ కేంద్రాల్లో గట్టి బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ప్రతి చోటా స్ట్రైకింగ్, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్సులను నియమించినట్లు తెలిపారు. గ్రామీణ ప్రజలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. రామకుప్పం పోలీస్‌స్టేషనులో రికార్డులు, కేసులకు సంబంధించిన ఫైళ్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసారు. పలమనేరు డీఎస్పీ సుధాకర్ రెడ్డి, కుప్పం రూరల్ సీఐ రియాజ్ అహ్మద్, డీటీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ శరత్‌చంద్ర, ఎస్‌ఐ కృష్ణయ్య పాల్గొన్నారు.

నేడు స్పందన రద్దు

తిరుపతి అర్బన్: తిరుపతి కలెక్టరేట్‌లో సోమవా రం నిర్వహించే స్పందన కార్యక్రమం రద్దు చేస్తున్నట్లు అధికారులు ఆదివారం తెలియజేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 21వ తేదీ వరకు ఎన్నికల కోడ్ ఉన్నట్లు వెల్లడించారు. ఈనెల 27వ తేదీ నుంచి యథావిధిగా స్పందన కార్యక్రమం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

వరసిద్ధుని దర్శనానికి 4 గంటలు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ కొనసాగింది. ఉదయం నుంచే పలు ప్రాంతాల నుంచి ఆలయానికి భక్తుల తాకిడి మొదలైంది. భక్తులు అశేషంగా తరలి వచ్చారు. క్యూలు, కంపార్ట్‌మెంట్‌లు భక్తులతో నిండి పోయాయి. దర్శనానికి 4 గంటల సమయం పట్టింది.



పోలింగ్ సామగ్రి పంపిణీని పరిశీలిస్తున్న రిటర్నింగ్ అధికారి హరినారాయణన్, జేసీ వెంకటేశ్వర్



తిరుపతిలో పోలింగ్ సామగ్రి పంపిణీలో కలెక్టర్ వెంకటరమణారెడ్డి

నేడే మండలి పోరు

- పటిష్ట బందోబస్తు నడుమ కేంద్రాలకు పోలింగ్ సామగ్రి
- ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్
- పట్టభద్రులకు 22 మంది, ఉపాధ్యాయ స్థానానికి 8 మంది పోటీ
- ఏర్పాట్లు పూర్తి చేసిన యంత్రాంగం

సాక్షి, తిరుపతి/చిత్తూరు కలెక్టరేట్ : తూర్పు రాయలసీమ పరిధిలోని ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు పట్టభద్రులు, ఉపాధ్యాయ శాసనమండలి నియోజకవర్గాలకు సోమవారం ఎన్నికలు జరగనున్నాయి. ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనుంది. గతంలో ఎన్నడూ లేని విధంగా పట్టభద్రులకు 22 మంది, ఉపాధ్యాయ ఎన్నికలకు 8 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. భారీ సైజు బ్యాలెట్ పేపర్లు, బ్యాలెట్ బాక్స్‌లను ఉపయోగించి పోలింగ్ నిర్వహిస్తున్నారు. వీడియో నిఘాలో పోలింగ్ నిర్వహించనున్నారు.

ఏర్పాట్లు పూర్తి

ఆయా జిల్లాల పరిధిలోని ఎస్పీల ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఒక్కో పోలింగ్ కేంద్రంలో ఐదుగురు సిబ్బంది ఎన్నికల విధుల్లో ఉంటారు. పోలింగ్ నిర్వహణ ఏర్పాట్లన్నీ పూర్తయినట్లు రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ హరి నారాయణన్ పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల పరిధిలోని కేంద్రాలకు పోలింగ్ సామగ్రితో సిబ్బంది చేరుకున్నట్లు వివరించారు. ఈనెల 16న ఎస్వీసెట్ ఇంజినీరింగ్ కళాశాలలో కౌంటింగ్ జరగనుంది.

అభ్యర్థులు వీరే

పట్టభద్రుల ఎన్నికలకు: శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి (వైఎస్సార్ సీపీ), కంచర్ల శ్రీకాంత్ (టీడీపీ), సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి (బీజేపీ), ఇండిపెండెంట్లుగా అప్పంగారి జైపాల్, అంకయ్య చౌదరి, కమ్మిశెట్టి భాస్కర్‌రావు, కరుణానిధి చిరిపిరెడ్డి, కిరణ్‌దశరన్న మట్టిగుంట, కొమ్ము యోహాను, గుళ్లాపల్లి వీరభద్రాచారి, దొడ్ల శ్రీహరి, నక్కా దినేష్, నీలం సామ్యేల్ మోజస్, పల్లిపట్టు అభినవ్ విష్ణు, పూసలరవి, పంతంగి పాలంకరెడ్డి, బుస్సారాజేంద్ర, బొట్టికాయల చంద్రశేఖర్, మహేంద్రరెడ్డి, మాదాసి జాలారావు, మీగడ వెంకటేశ్వరరెడ్డి, సరిత పోటీలో ఉన్నారు.

ఉపాధ్యాయ ఎన్నికలకు: చంద్రశేఖర్‌రెడ్డి పర్వతరెడ్డి, కుట్టుబోయిన బ్రహ్మానందం, గుర్రం శ్రీరామమూర్తి, ధనుంజయ శివయోగి, ప్రవీణ పర్వతరెడ్డి, బాబురెడ్డి పొక్కిరెడ్డి, ఎల్‌సీ రమణారెడ్డి, లక్కు అనుసూయ పోటీ చేస్తున్నారు.

తొలి ప్రాధాన్యత ఇస్తేనే ఓటు చెల్లుబాటు

ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రాధాన్యత ఓటు విధానంలో నిర్వహిస్తారు. ఓటర్లు తమ తొలి ప్రాధాన్యత ఓటును తప్పనిసరిగా వినియోగించుకోవాల్సి ఉంటుంది. లేకుంటే ఓటు చెల్లుబాటు కాదు. ఓటింగ్‌కు సంబంధించి అధికారులు కొన్ని ముఖ్యమైన సూచనలు చేశారు. అవి ఇలా..

- పోలింగ్ కేంద్రంలో బ్యాలెట్ పత్రంతో పాటు ఇచ్చిన ఊదా (వయోలెట్) రంగు స్కెచ్ పెన్‌తో మాత్రమే ఓటు వేయాలి.
- ఓటరు తాను మొదటి ప్రాధాన్యత ఇవ్వదలచుకున్న అభ్యర్థి పేరుకు ఎదురుగా ఉన్న ఖాళీ గడిలో '1'అంకెను రాయాలి.
- ప్రాధాన్యతలను తెలిపేందుకు అంతర్జాతీయ ప్రామాణిక అంకెలు 1, 2, 3, 4... లేదా రోమన్ అంకెలు లేదా భారత రాజ్యాంగం 8వ షెడ్యూల్ గుర్తించిన ఇతర భారతీయ భాషల్లో ఉపయోగించే అంకెలను వినియోగించవచ్చు.
- ఒకే సంఖ్యను ఒక అభ్యర్థి కన్నా ఎక్కువ మందికి ఇవ్వకూడదు.
- బ్యాలెట్ పత్రంపై ఓటర్లు తమ ఇంటి పేరు, ఇతర పదాలు, సంతకం, పొడి అక్షరాలు రాయకూడదు. వేలిముద్రలు కూడా వేయకూడదు.
- ఓ క్రమపద్ధతిలో మడతపెట్టిన బ్యాలెట్ పత్రాన్ని బాక్సులో వేయాలి.



పోలింగ్ సామగ్రిని తీసుకెళ్తున్న సిబ్బంది

ఎన్నికల సమాచారం ఇలా...

పోలింగ్ జరగనున్న జిల్లాలు:
ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు

మొత్తం పట్టభద్రుల ఓటర్లు	3,81,181
పురుషులు	2,45,866
మహిళలు	1,35,284
ఇతరులు	31
బరిలో ఉన్న అభ్యర్థులు	22
పోలింగ్ కేంద్రాలు	453
మొత్తం ఉపాధ్యాయ ఓటర్లు	27,694
పురుషులు	16,825
మహిళలు	10,869
బరిలో ఉన్న అభ్యర్థులు	08
పోలింగ్ కేంద్రాలు	176

ఈ గుర్తింపు కార్డుల్లో ఏదున్నా ఓకే

ఓటు హక్కు వినియోగించుకునేవారు పది గుర్తింపు కార్డుల్లో ఏవైనా చూపొచ్చని రిటర్నింగ్ అధికారి తెలిపారు. ఆధార్, డ్రైవింగ్ లైసెన్స్, పాన్‌కార్డు, పాస్‌పోర్ట్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ప్రభుత్వ రంగ సంస్థలు, స్థానిక సంస్థలు, ప్రైవేట్ కంపెనీలు జారీచేసిన సర్వీస్ గుర్తింపుకార్డులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అధికారిక గుర్తింపు కార్డు, విద్యాసంస్థలు జారీచేసిన సర్వీస్ గుర్తింపు కార్డు, విశ్వవిద్యాలయాలు జారీచేసిన డిగ్రీ/డిప్లొమా ఒరిజనల్ ధ్రువపత్రం, దివ్యాంగులు ధ్రువపత్రం, కేంద్ర సామాజిక న్యాయం, సాధికారిత శాఖ జారీచేసిన ప్రత్యేక వైకల్య గుర్తింపు కార్డుల్లో దేన్నయినా చూపించవచ్చు.

పోలింగ్ కేంద్రాలు ఇలా..

పట్టభద్రుల ఎన్నికలకు చిత్తూరు జిల్లాలో 69, తిరుపతి జిల్లాలో 101 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉపాధ్యాయ ఎన్నికలకు చిత్తూరు జిల్లాలో 31, తిరుపతి జిల్లాలో 37 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

పకడ్బందీ ఏర్పాట్లు

" ఎమ్మెల్సీ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు చేశాం. నిష్పక్షపాతంగా నిర్వహించేలా చర్యలు చేపట్టాం. పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాం. ఓటర్లు ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకోవచ్చు. ఓటు ఎలా వేయాలి అనే అంశంపై ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద అవగాహన బ్యానర్ ఏర్పాటు చేశాం. భారీ పోలీసు బందోబస్తు కల్పించాం. – కె.వెంకటరమణారెడ్డి, కలెక్టర్, తిరుపతి

సవాళ్లను ఎదుర్కోలేవా లోకేష్?



కేక్ కట్ చేసి టీటీడీ పాలకమండలి సభ్యులు పోకల అశోక్‌కుమార్‌కు తినిపిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి. పాల్గొన్న ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, పార్టీ సీనియర్ నాయకులు ఎంఆర్‌సీ.రెడ్డి

- వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

తిరుపతి మంగళం: 'సవాళ్లను ఎదుర్కొనే దమ్ము లేనప్పుడు సవాళ్లు చేయకూడదు లోకేష్' అని రాష్ట్ర అటవీ, విద్యుత్, భూగర్భగనులశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హితవు పలికారు. తిరుపతి మారుతీనగర్‌లోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో ఆదివారం వైఎస్సార్‌సీపీ 13వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, టీటీడీ పాలకమండలి సభ్యులు పోకల అశోక్‌కుమార్, పార్టీ సీనియర్ నాయకులు ఎంఆర్‌సీ.రెడ్డి పార్టీ జెండాను ఆవిష్కరించారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్.రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అక్కడ ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇదే తరహాలో పాలన సాగించి వందేళ్లు పూర్తి చేసుకోవాలని ఆకాంక్షించారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవంతో పార్టీ నాయకులు, కార్యకర్తల్లో మరింత ఉత్తేజం కలుగుతోందన్నారు. చిత్తూరు జిల్లాకు చెందిన మాజీ మంత్రి అమరనాథరెడ్డి అందించిన స్లిప్‌లు చదివి సవాళ్లు చేసిన లోకేష్‌కి ప్రతిసవాళ్లను ఎదుర్కొనే దమ్ము లేదా? అని ప్రశ్నించారు. లోకేష్ సవాళ్లకు ఎంపీ మిథున్‌రెడ్డి సిద్ధమైతే ఆయన మెల్లగా జారుకోవడం వారి చేతగానితనమే అవుతుందన్నారు. పశ్చిమ, తూర్పు రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలు వైఎస్సార్‌సీపీవేనని ధీమా వ్యక్తం చేశారు.

ఘనంగా వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం



తిరుపతి: పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న ఎంపీ గురుమూర్తి



నగరి: ఆవిర్భావ వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న మంత్రి ఆర్‌కే రోజా

చిత్తూరు కార్పొరేషన్: యువజన శ్రామిక రైతు కాంగ్రెస్ పార్టీ (వైఎస్సార్‌సీపీ)13వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు జిల్లాలో ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలు ఘనంగా నిర్వహించారు. అన్ని నియోజకవర్గాల్లో ఆవిర్భావ వేడుకలు చేసుకున్నారు.

తిరుపతి జిల్లాలో..

తిరుపతి: నగరంలోని మంత్రి పెద్దిరెడ్డి నివాసంలో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించి దివంగత నేత వైఎస్సార్ విగ్రహానికి నివాళి అర్పించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపు వైఎస్సార్‌సీపీ మద్దతుదారులదే అని ధీమా వ్యక్తం చేశారు.

వెంకటగిరి: వెంకటగిరిలో తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో కేక్‌కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.

సూళ్లూరుపేట: సూళ్లూరుపేటలో ఎమ్మెల్యే కె.సంజీవయ్య ఆధ్వర్యంలో కేక్‌కట్‌చేసి వేడుకలు నిర్వహించారు.

చంద్రగిరి: చంద్రగిరిలో ఎమ్మెల్యే చెవిరెడ్డి తనయుడు హర్షిత్‌రెడ్డి ఆధ్వర్యంలో కేక్‌కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు.

చిత్తూరు జిల్లాలో..

నగరి: నగరి పట్టణంలోని స్థానిక వైఎస్సార్‌సీపీ క్యాంప్ కార్యాలయం, వడమాలపేట మండలంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని క్రీడలు, పర్యాటక శాఖ మంత్రి ఆర్‌కే రోజా ఘనంగా నిర్వహించారు. కార్యాలయంలో మహానేత వైఎస్సార్ కాంస్య విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి పంచి పెట్టి శుభాకాంక్షలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ జెండా ప్రతిపక్షాల గుండెల్లో వణుకు పుట్టిస్తోందని మంత్రి అన్నారు.

పూతలపట్టు: పూతలపట్టు, బంగారుపాళెం మండలాల్లో ఎమ్మెల్యే ఎంఎస్‌బాబు ఆధ్వర్యంలో ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన కేక్‌ను కట్ చేసి నాయకులకు, కార్యకర్తలకు పంచిపెట్టారు. రానున్న రోజుల్లో పార్టీ పై అభిమానం ప్రజలు ఇలానే కొనసాగించాలని కోరారు.

పుంగనూరు: పుంగనూరులో రాష్ట్ర జానపద కళల సంస్థ చైర్మన్ కొండవీటి నాగభూషణం, మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, రాయలసీమ జిల్లాల మైనారిటీ సెల్ ఇన్‌చార్జి ఫక్రుద్దీన్ షరీఫ్ నాయకులతో కలిసి కేక్‌కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.

జీడీనెల్లూరు: కార్వేటినగరంలో మండల కన్వీనర్ ధనంజయశర్మ, జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు.

పలమనేరు: పట్టణంలో ఎమ్మెల్యే వెంకటేగౌడ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి వేడుకలు చేశారు.

పోలింగ్ శాతంపై దృష్టి



సూచనలిస్తున్న తుడా చైర్మన్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

- తుడా చైర్మన్ చెవిరెడ్డి దిశానిర్దేశం

పిచ్చాటూరు: ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోలింగ్ శాతంపై దృష్టి పెట్టి వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థులను గెలిపించేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని తుడా చైర్మన్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అన్నారు. ఆదివారం నాగలాపురం మార్కెట్ యార్డ్‌లో ఎమ్మెల్సీ పోలింగ్ నిర్వహణపై స్థానిక ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంతో కలిసి చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ఎక్కువ మంది ఓటు హక్కును వినియోగించుకునేలా పని చేయాలని సూచించారు. ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం మాట్లాడుతూ ఓటర్లందరూ ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాలని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాగలాపురం మండల కన్వీనర్ అపరంజిరాజు, రాష్ట్ర కార్యదర్శి కేవీ భాస్కర్ నాయుడు, మండల సచివాలయ కన్వీనర్ మోహన్ మొదలి, ట్రేడ్ యూనియన్ అధ్యక్షులు ఎస్‌ఎం సురేష్, నాయకులు చిన్నదొరై, ఉదయ రెడ్డి, కిరణ్‌కుమార్, ఆనంద్, మురళీ రెడ్డి, శ్రీనివాసులు,మహేష్, విజయ్‌కుమార్, దేశప్పన్ పలువురు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన లక్ష కుంకుమార్చన

- కలశ జలాలతో సంప్రోక్షణ
- పూర్ణాహుతిలో పాల్గొన్న ఎమ్మెల్యే భూమన



పూర్ణాహుతి చేస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, మేయర్ శిరీష

తిరుపతి కల్చరల్: తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో మూడు రోజులుగా చేపట్టిన లక్ష కుంకుమార్చన ఆదివారం ఘనంగా ముగిసింది. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య శాస్త్రోక్తంగా లక్ష కుంకుమార్చన చేపట్టారు. మూడు రోజులు జరిగిన పూజల్లో 1,550 మంది దంపతులు పాల్గొన్నారు. మధ్యాహ్నం చేపట్టిన మహా పూర్ణాహుతితో లక్ష కుంకుమార్చన ముగిసింది. తర్వాత కలశ జలాలతో సంప్రోక్షణ చేశారు. అంతకుముందు ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి కలశాన్ని నెత్తిన పెట్టుకుని ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేశారు. మేయర్ డాక్టర్ శిరీష, ఆలయ చైర్మన్ కట్టా గోపీయాదవ్, ఈవో ఎం.మునిక్రిష్ణయ్య, వైఎస్సార్ సీపీ నేత దొడ్డారెడ్డి సిద్ధారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు వెంకటేశ్వరరావు, ఎం.హరినాథ్‌రెడ్డి, టి.రమణమ్మ, పి.ధనశేఖర్, వి.క్రిష్ణమ్మ, ఎస్.భారతి పాల్గొన్నారు.

ధూమపానం.. ప్రాణాంతకం



తిరుపతి జిల్లా చిల్లకూరు మండలం ఏరూరు గ్రామానికి చెందిన సైకత శిల్పకారుడు మంచాల సనత్‌కుమార్ 'ధూమ పానంతో ఆరోగ్యం క్షీణిస్తుంది' అనే అంశంపై సముద్ర తీరంలో ఆదివారం సైకత శిల్పాన్ని రూపొందించారు. ఈ శిల్పానికి 'స్మోకింగ్ కిల్స్' అనే ట్యాగ్ లైన్ ఏర్పాటు చేశారు. 'ప్రపంచ నో స్మోకింగ్ డే' సందర్భంగా రూపొందించిన ఈ సైకత శిల్పం ఆకట్టుకుంటోంది. – చిల్లకూరు

క్లుప్తంగా

కోడిపందాల స్థావరంపై దాడులు



పట్టుబడిన నిందితులు, కోళ్లు చూపుతున్న డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి

గూడూరురూరల్ : మండలంలోని చెంబడి పాళెం గ్రామ సమీపంలో ఆదివారం కోడిపందేల స్థావరంపై పోలీసులు దాడి చేసి 9 మందిని అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు డీఎస్పీ సూర్యనారాయణ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ, విశ్వసనీయ సమాచారం మేరకు ఆదివారం ఈ దాడులు చేసినట్లు తెలిపారు. అక్కడ కోడిపందాలు ఆడుతున్న 9 మందిని అరెస్టు చేసి, వారివద్ద నుంచి 9 సెల్‌ఫోన్లు, రూ.1,01,500 నగదుతోపాటు 4 పందెం కోళ్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితులను కోర్టులో హాజరుపరచనున్నట్లు తెలిపారు. పోలీసు సిబ్బందికి రివార్డులు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో రూరల్ సీఐ జి.దశరథరామారావు, ఎస్‌ఐ బ్రహ్మనాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

కుక్కల దాడిలో ముగ్గురికి గాయాలు

కోట: మండలంలో కుక్కలదాడిలో ముగ్గురు గాయపడ్డారు. విద్యానగర్‌లో ఆదివారం నడిచి వెళుతుండగా కుక్కలు వెంటపడి దాడి చేశాయి. ఈ దాడిలో సురేష్, జాన్వి గాయపడ్డారు. ప్రకాశంకాలనీలో మరో చిన్నారి హనీష్‌ను కుక్కలు కరవడంతో కోట ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు పటిష్ట భద్రత

- సీసీ కెమెరాలతో నిఘా
- జిల్లా వ్యాప్తంగా 138 పోలింగ్ కేంద్రాలు
- ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి

తిరుపతి క్రైమ్: ఎమ్మెల్సీ ఎన్నికలకు పటిష్ట భద్రత ఏర్పాటు చేసినట్లు ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. శ్రీ పద్మావతి డిగ్రీ కాలేజీలో ఎన్నికల సిబ్బందితో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా 138 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి కేంద్రంలో ఎన్నికల నిర్వహణ సజావుగా జరిగేందుకు కావలసిన బందోబస్తును ఏర్పాటు చేశామన్నారు. అదే విధంగా 8 సమస్యాత్మక ప్రాంతాల్లో 51 కేంద్రాలను గుర్తించినట్లు వివరించారు. ఆ కేంద్రాల్లో అదనపు బలగాలతో భద్రత ఏర్పాట్లను చేసినట్లు చెప్పారు. పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేస్తున్నామన్నారు. పోలీస్ అధికారులకు, సిబ్బందికి, వివిధ రకాల శాఖల అధికారులతో కలిసి పోలింగ్ రోజున ఏదైనా సమస్యలు తలెత్తితే వెంటనే ప్రొసీడింగ్ అధికారికి తెలియజేయాలన్నారు. నిరంతరం తనిఖీలు చేపడుతూ ట్రబుల్ మంగర్స్, రౌడీ షీటర్లను ముందుగానే గుర్తించి బైండోవర్ చేసుకోవాలని ఆదేశించారు. 23 రెవిన్యూ రూట్స్ లో ప్రత్యేక పోలీస్ బలగాలు ఏర్పాటు చేసి స్ట్రాంగ్ రూమ్ నుంచి పోలింగ్ కేంద్రాల వరకు ఎస్కార్ట్ ఏర్పాటు చేయాలన్నారు. ఏదైనా సమస్య వచ్చిన వెంటనే స్థానికులు కూడా డయల్ 100కు సమాచారం అందించాలన్నారు.

ఎన్నికల నియమావళి తప్పనిసరి

అభ్యర్థులు ఏజెంట్లు ఎన్నికల నియమావళి తప్పనిసరిగా పాటించాలన్నారు. ఆర్‌ఓ ఉత్తర్వులు తప్పకుండా పాటించాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద పోలీస్ యాక్ట్ 30, 144 సెక్షన్ అమల్లో ఉంచాలన్నారు. ఎవరైనా చట్టాన్ని అతిక్రమిస్తే కఠినమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఎవరైనా రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేస్తే తప్పవని హెచ్చరించారు. సభలు సమావేశాలు ఏర్పాటు చేస్తే పోలీసులు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. రాత్రి 10 నుంచి ఉదయం 6 గంటల వరకు ఎన్నికల ప్రచారం చేయకూడదని చెప్పారు. ఓటర్లను పోలింగ్ బూత్కు వాహనాల్లో తరలించడం నేరమన్నారు. ఈ సమావేశంలో ఏఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికలకు ప్రశాంత వాతావరణం

చిత్తూరు అర్బన్: ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చర్యలు తీసుకున్నామని డీఎస్పీ శ్రీనివాసమూర్తి అన్నారు. నగరంలోని తన కార్యాలయంలో ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో మొత్తం 33 పోలింగ్ కేంద్రాలుంటే, ఇందులో 16 సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించామన్నారు. అక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామన్నారు. పోలింగ్ కేంద్రాలకు వంద మీటర్ల దూరం ఉండేలా 144 సెక్షన్ అమలు చేశామన్నారు. పోలింగ్ కేంద్రాల్లో విధులు నిర్వహించే సిబ్బంది గుర్తింపు కార్డు కలిగిన ఏజెంట్లను మాత్రమే లోనికి అనుమతించాలన్నారు. ఇంకు, వాటర్ బాటిల్, మొబైల్స్, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా జరిగేందుకు 12 పోలీస్ రూట్ మొబైల్స్ లో ఒక్కో రూట్ మొబైల్‌కి ఎస్‌ఐ స్థాయి అధికారిని ఇన్‌చార్జ్‌గా నియమించినట్లు తెలిపారు. నిరంతర నిఘాకు 25 మందిని ప్రత్యేకంగా కేటాయించామన్నారు. ఎలాంటి సమస్య వచ్చినా డయల్ 100కు, చిత్తూరు పోలీస్ వాట్సాప్ నెంబరు 9440900005కు సమాచారం ఇవ్వచ్చొని పేర్కొన్నారు.

మంత్రి పెద్దిరెడ్డికి విదేశీ వైద్యుల ఆహ్వానం



ఆస్పత్రి ప్రారంభోత్సవానికి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని ఆహ్వానిస్తున్న విదేశీ వైద్యులు

తిరుపతి మంగళం: చిత్తూరు నియోజకవర్గంలోని గుడిపాల మండలంలో నూతనంగా నిర్మించిన ఎస్టీ పాయుల్స్ మల్టీ సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి ప్రారంభోత్సవానికి రాష్ట్ర అటవీ, విద్యుత్, గనుల శాఖమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని విదేశీ వైద్యులు ఆహ్వానించారు. తిరుపతి మారుతీనగర్‌లోని మంత్రి కార్యాలయంలో ఆదివారం డాక్టర్ పన్నీర్‌సెల్వమ్, యోగలతతోపాటు అమెరికన్ వైద్యులు మంత్రి పెద్దిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి ఆస్పత్రి ప్రారంభోత్సవానికి ఆహ్వానించారు.

ట్యాంకర్‌ను ఢీకొన్న కారు..నలుగురికి గాయాలు



ట్యాంకర్‌ను ఢీకొన్న కారు

చంద్రగిరి: వాటర్ ట్యాంకర్‌ను కారు ఢీకొన్న ఘటనలో నలుగురు గాయాలపాలైన ఘటన పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారి ముంగళిపట్టు వద్ద ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు, గుంటూరుకు చెందిన కృష్ణ చైతన్య తన కుటుంబ సభ్యులతో కలసి తిరుమల శ్రీవారిని దర్శించుకోవడానికి కారులో ఆదివారం తెల్లవారుజామున తిరుపతికి పయనమయ్యారు. ముందుగా కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామివారిని దర్శించుకుని తిరుపతికి బయల్దేరారు. ముంగళిపట్టు వద్ద వస్తున్న క్రమంలో జాతీయ రహదారి డివైడర్‌పై వాటర్ ట్యాంకు ద్వారా నీళ్లు పడుతున్న సిబ్బంది ఎటువంటి సూచిక బోర్డులను ఏర్పాటు చేయకపోవడంతో వెనుక నుంచి కారు ట్యాంకర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో కృష్ణ చైతన్యతోపాటు ఆయన భార్య సంధ్య, పిల్లలు శ్రీనిధి, ప్రణవి గాయాలపాలయ్యారు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



అంతర్రాష్ట్ర గంజాయి స్మగ్లర్ల అరెస్ట్



ముఠా అరెస్ట్ చూపిస్తున్న డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి

సూళ్లూరుపేట : తమిళనాడుకు గంజాయిని తరలిస్తున్న అంతర్రాష్ట్ర స్మగ్లింగ్ ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి ఆదివారం మీడియాతో మాట్లాడుతూ, అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన కొంతమంది బెడ్‌షీట్లు అమ్ముకునే వారిలాగా రైళ్లలో గంజాయిని తీసుకొచ్చి సూళ్లూరుపేట రైల్వేస్టేషన్‌కు చేర్చగా.. తమిళనాడుకు చెందిన మరికొంతమంది బెడ్‌షీట్లు కొనుగోలు చేసినట్టుగా నటించి ఆ గంజాయిని తీసుకుని వెళుతున్నారని తెలిపారు. ఈ తరహాలో పట్టణాన్ని కేంద్రంగా చేసుకుని గంజాయి స్మగ్లింగ్ చేస్తున్న ముఠాను రైల్వేస్టేషన్ రోడ్డులో అరెస్టు చేసినట్లు వివరించారు. వారి నుంచి రూ.3.84 లక్షలు విలువ చేసే 12 కిలోల గంజాయి, 8 మొబైల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్టు పేర్కొన్నారు. ఈ ముఠాలో అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన ఐదుగురు, తమిళనాడుకు చెందిన ఇద్దరు ఉన్నట్లు తెలిపారు. వీరిలో ముగ్గురు మహిళలు ఉన్నట్లు వివరించారు. ఆదివారం పట్టుబడిన ముఠాలో అల్లూరుసీతారామరాజు జిల్లా చింతపల్లి మండలం, లోతుగడ్డ ప్రాంతానికి చెందిన చెందిన మొహమ్మద్ జరీద్ (42), గూడెం కొత్తపల్లి మండలం, దేవరపల్లెకు చెందిన సబ్రహబార్ సాదిక్ (40) 12కిలోల గంజాయిని తీసుకొచ్చి రైల్వేస్టేషన్‌లో రోడ్డులోని పోస్టాఫీస్ వద్ద ఎదురు చూస్తుండగా, తమిళనాడులోని చెంగల్పట్‌కు చెందిన మారియప్పన్ (42), చెన్నైకు చెందిన కన్మణి (28), ఏ రమణి (26), మణిమేఘలై (32), శివకుమార్(24) వచ్చి వారితో బేరం కుదుర్చుకునే సమయంలో పోలీసులు దాడులు చేసి, అందరినీ అక్కడికక్కడే అరెస్టు చేశారు. వీరిని కోర్టులో హాజరు పరచగా జడ్జి రిమాండ్‌కు తరలించినట్టు వెల్లడించారు. సీఐ వెంకటేశ్వర్లురెడ్డి, ఎస్‌ఐలు రవిబాబు, జేసీ శ్రీనివాసులురెడ్డి, ఎం జ్ఞానశేఖర్, మనోజ్‌కుమార్, వారి సిబ్బంది శీనయ్య, ఎస్ కిషన్, ఎన్ గిరిబాబు, జే రజని, అంకమ్మ వారం రోజుల్లో 24 కిలోల గంజాయిని పట్టుకున్నారని తెలిపారు.

అ'పూర్వ' సమ్మేళనం



సమావేశమైన పూర్వ విద్యార్థులు

తిరుపతి కల్చరల్: నగరంలోని పాయ్ వైస్రాయ్ హోటల్లో 80 ఏళ్లు పైబడిన పూర్వ విద్యార్థులు అపూర్వ కలయికతో మధుర జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ ఆనందభరితులయ్యారు. వీరందరు అన్నమయ్య జిల్లాలోని పీలేరులో అప్పటి పాఠశాల బోర్డు స్కూల్లో 1958–59,60లో పదో తరగతి చదివినవారు. వీరు గతంలో తమకు విద్యాజ్ఞానం ప్రసాదించిన పాఠశాలకు జిరాక్స్ మిషన్, సోలార్ లైట్లు, గాడ్రెజ్ టేబుల్ అందించి, తమ కృతజ్ఞతాభావాన్ని చాటుకున్నట్లు తెలిపారు. 80ఏళ్లు పైబడినా తమ పాఠశాల మధురజ్ఞాపకం ఇప్పటికీ మిగిలిపోయిందని, ఇంత మంది స్నేహితులు ఇక్కడ కలవడం మహదానందమని తెలిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఎం.బలరామకృష్ణ, ఏ.రెడ్డి సుబ్రమణ్యం, ఆర్.రామచంద్రయ్య, పి.రెడ్డెప్పరెడ్డి, ఎస్.సురేంద్రరెడ్డి, వి.సుబ్రమణ్యంరెడ్డి, రంగారెడ్డి, రాఘవరెడ్డితో పాటు 30 మంది హాజరయ్యారు.

బ్రాహ్మణ వివాహ వేదికకు విశేష స్పందన



బ్రాహ్మణ దంపతులకు షష్టిపూర్తి చేస్తున్న బ్రాహ్మణ సమాజం ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సమాఖ్య ఆధ్వర్యంలో ఆదివారం బైరాగిపట్టెడలోని వైఖానస ఆశ్రమంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి బ్రాహ్మణ వివాహ పరిచయ వేదికకు విశేష స్పందన లభించింది. ఇందులో సుమారు 800 మంది బ్రాహ్మణ వధూవరులు, బంధువులు పాల్గొన్నారు. అంతకుముందు డాక్టర్ చక్రవర్తి రాఘవన్, నరసింహాచార్య ఆధ్వర్యంలో షష్టి పూర్తి మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. 10 మంది బ్రాహ్మణ వృద్ధ దంపతులకు పట్టువస్త్రాలు సమర్పించి అభినందించారు. తిరుపతి బ్రాహ్మణ సమాజం ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి అజయ్‌కుమార్, సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు వెంకటరామరాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వాసుదేవరావు, జిల్లా అధ్యక్షుడు ఓవీ.రామశర్మ, వేదం హరిప్రసాద్, సమాజం నేతలు విజయకుమార ఎంఆర్.రాజ, కృష్ణశేషు, గంగాధర్, గోకుల్ రాజులోచన్ శర్మ, పట్టాభిరామారావు, మల్లికార్జున, మురళి, మహిళా సంఘం అధ్యక్షురాలు ప్రమీలమ్మ, సంధ్యారాణి, విజయలక్ష్మి, సుధావాణి, సమాఖ్య లీగల్ సెల్ కన్వీనర్ కేఎల్.నారాయణ, కర్నూలు, అనంతపురం, కడప, నెల్లూరు జిల్లాలకు చెందిన బ్రాహ్మణులు పాల్గొన్నారు.

ఏనుగుల బీభత్సం - పూరిగుడిసె ధ్వంసం



ఏనుగులు ధ్వంసం చేసిన పూరి గుడిసెను పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు

పెద్దపంజాణి: మండలంలో ఏనుగులు బీభత్సం సృష్టిస్తున్నాయి. పెద్దకాప్పల్లి పంచాయతీలోని పెద్దకాప్పల్లి, ముదిరెడ్డిపల్లి, పెనుగొలకల, తిప్పిరెడ్డిపల్లి, ఆకులవారిపల్లి, కొత్తబూరగపల్లి, జిట్టంవారిపల్లి, బందార్లపల్లి రైతుల పొలాల్లోకి ఏనుగుల గుంపు పదే పదే చొరబడుతూ పంటలకు తీవ్ర నష్టం కలిగిస్తోంది. పేటూరు ఫారెస్టు బీటు నుంచి శనివారం రాత్రి వచ్చిన నాలుగు ఏనుగులు బందార్లపల్లి అటవీ ప్రాంత సమీపంలోని యానాది క్రిష్ణప్ప నివసిస్తున్న పూరి గుడిసెను ధ్వంసం చేశాయి. అందులోని ధాన్యాన్ని పూర్తిగా తినేశాయి. గుడిసెలోని ఇతర సామగ్రిని తొక్కి నాశనం చేశాయి. ఈ క్రమంలో ఏనుగుల శబ్దం విన్న క్రిష్ణప్ప కుటుంబీకులు అక్కడి నుంచి బందార్లపల్లెలోకి పరుగులు తీశారు. ఈ దాడిలో సుమారు రూ.50 వేల మేరకు నష్టం జరిగినట్లు అంచనా వేశారు. సమాచారం అందుకున్న రాయలపేట, చారాల బీట్ ఆఫీసర్లు రవికుమార్, దొరస్వామి ఆదివారం ఏనుగులు ధ్వంసం చేసిన పూరి గుడిసెను పరిశీలించారు. తమ వంతు తక్షణ సహాయంగా బాధిత కుటుంబానికి ఉచితంగా బియ్యాన్ని అందజేశారు. పంట నష్టం వివరాలను ఉన్నతాధికారులకు పంపించి పరిహారం మంజూరుకు చర్యలు చేపడతామని తెలిపారు. ట్రాకర్ల సహాయంతో ఏనుగులను అడవిలోకి మళ్లించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు.

గంజాయి తాగుతున్న యువకుల అరెస్టు

నాయుడుపేటటౌన్ : పట్టణ పరిధిలోని బేరిపేటలో ఉన్న ఓ ఇంటిలో గంజాయి తాగుతున్న ఆరుగురు యువకులను ఆదివారం పట్టుకున్నట్లు ఎస్‌ఈబీ ఇన్‌స్పెక్టర్ ఆర్‌యూవీఎస్ ప్రసాద్ తెలిపారు. మత్తు పదార్థాల నివారణ చర్యల్లో భాగంగా పట్టణంలో ఎస్‌ఈబీ పోలీసులతో దాడులు జరిపినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. ఈ క్రమంలో బేరిపేటలో ఓ ఇంటిలో కొంత మంది యువకులు గంజాయి సేవిస్తున్నట్లు సమాచారం వచ్చిందన్నారు. వెంటనే సిబ్బంది దాడి చేసి అక్కడ అదే ప్రాంతానికి చెందిన ఆరుగురు యువకులను గంజాయి సేవిస్తుండగా పట్టుకున్నట్లు వివరించారు. వీరిపై కేసు నమోదు చేసి వారి వద్ద నుంచి 80 గ్రాములు గంజాయి, మూడు గొట్టాలను సైతం స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఈ దాడుల్లో ఎస్‌ఈబీ పోలీసులు ఉన్నట్లు తెలిపారు.